జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 28-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 712 పేజీలు: 4 వెల : రూ.7


* మద్యం మత్తులో డెంటల్ కాలేజ్ సమీపంలో ఓ కాఫీ సెంటర్‌పై దాడి * భయభ్రాంతులకు గురైన కస్టమర్లు, కాఫీ సెంటర్ నిర్వాహకులు
* హైవే దాబాలపై నిత్యం ఇదే తంతు
* రౌడీషీటర్ల పేరు చెప్పుకొని దందా
* శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నిర్వాహకులు
* కేసు కట్టకుండా వదిలేసిన పోలీసులు?

# ఆకతాయిల.. వీరంగం..!




శ్రీకాకుళం, జూన్ 27 (వార్త): శ్రీకాకుళం నగరానికి అనుకుని ఉన్న జాతీయ రహదారికి అనుకుని ఉన్న కెఫేలు, దాబాల వద్ద కొందరు ఆకతాయిలు నిత్యం వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం మత్తులో దాడులకు పాల్పడుతూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. కెఫే సెంటర్లు, దాబాల వద్ద ప్రతిరోజూ గొడవలు జరుగుతునే ఉన్నాయి. ధాబాలు, కెఫేల్లో ఫుల్‌గా తినేసి ఆ తర్వాత బిల్లులు ఇవ్వకుండా నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడమే కాకుండా కొట్లాటకు దిగుతున్నారు. కొందరు ఆకతాయిలైతే రౌడీషీటర్ల పేరు చెప్పి, ఇక్కడ దాబాలు, కెఫే సెంటర్లు లేకుండా చేస్తామని పెద్దపెద్దగా కేకలు వేస్తూ రంకెలు వేస్తున్నారు. దీంతో నిర్వాహకులతో పాటు కస్టమర్లు కూడా భయబ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు కూడా ఉన్నాయి. కొందరు రౌడీషీటర్లయితే ఏకంగా ధాబాల్లో ఫుల్‌గా తాగి తిని బిల్లులు ఇవ్వకుండా వెళ్లిపోవడం ఇక్కడ సర్వసాధారణ విషయమని దాబాల నిర్వాహకులు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే మళ్లీమళ్లీ వచ్చి గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా, శుక్రవారం రాత్రి డెంటల్ కాలేజీ సమీపంలో కొత్తగా ఏర్పాటైన ఓ కెఫే సెంటర్‌లో రిమ్స్ కాలేజీకి చెందిన మహిళా మెడికోలు కొందరు పార్టీ చేసుకుంటున్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఆరుగురు యువకులు మద్యం మత్తులో వచ్చి వారితో అసభ్యకరంగా వ్యవహరించారు. దీంతో కెఫే సెంటర్ నిర్వాహకులు వచ్చి సముదాయించారు. మహిళలతో అసభ్యకరంగా వ్యవహరించడం తగదని చెప్పినప్పటికీ ఆ యువకులు మరింతగా రెచ్చిపోయారు. తమకు రౌడీషీటర్ల అండ ఉందని ఏం చేయలేరంటూ గట్టిగా కేకలు వేశారు. దీంతో ఆ మహిళా మెడికోలు భయబ్రాంతులకు గురయ్యారు. దీంతో కెఫే సెంటర్ నిర్వాహకులు పోలీసులకు ఫోన్ చేశారు. అయితే ఆ యువకులు మద్యం మత్తులో తమను పోలీసులు ఏం చేయలేరని, ఇక్కడ కెఫే సెంటర్ లేకుండా చేస్తామని గంటసేపు రుబాబు చేశారు. అక్కడే ఉన్న కస్టమర్లు, సెంటర్ నిర్వాహకులు వారిని సముదాయించినా మద్యం మత్తులో ఆ ఆకతాయిలు బూతులు మాట్లాడారు. ఆ ఆకతాయిలు పెదపాడు, బలగ సమీపంలోని కుమ్మరివీధికి చెందిన వారని కొందరు చెబుతున్నారు. కెఫే సెంటర్ యజమాని కాశీం ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి ఆ ఆకతాయిలను జీపులో ఎక్కించుకుని శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ యువకులను రూరల్ పోలీసులు వదిలిపెట్టేసినట్టు భోగట్టా.




# ఫ్రెండ్లీ పోలీసింగ్.. అంటే ఇదేనా?

* యువతపై నౌపడ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన * కానిస్టేబుల్ తీరుపై సర్వత్రా విమర్శలు
* కొందరు పోలీసుల వల్ల వ్యవస్థకే మచ్చ
* కరెంట్ కోతలపై లైన్‌మాన్, సబ్‌స్టేషన్ సిబ్బందిని నిలదీసిన నౌపడ యువకులు
* రొయ్యల చెరువులకు కరెంట్ ఇచ్చి.. మాకెందుకు తీస్తున్నారని అడిగిన యువత
* విద్యుత్ సిబ్బందికి వత్తాసు పలికిన పోలీసులు
* సోలార్ పెట్టుకోవాలంటూ ఓ కానిస్టేబుల్ ఉచిత సలహా * కానిస్టేబుల్ మాట తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు
* నౌపడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన







సంతబొమ్మాళి, జూన్ 27 (వార్త): ప్రతిరోజు నౌపడ సబ్ స్టేషన్ పరిధిలోగల గ్రామాలలో కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంటు రాత్రి తీసేసినప్పుడు వివరాలు తెలుసుకోవడం కోసం లైన్ మాన్, సబ్ స్టేషన్ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదు. కొన్నిసార్లు దురుసుగా సమాధానం ఇస్తున్నారు. శుక్రవారం రాత్రి 10 సమయంలో కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఆగ్రహించారు. ఫోన్ చేసినా విద్యుత్ లైన్ మెన్ స్పందించకపోవడంతో కరెంటు ఎందుకు తీస్తున్నారో అడగడానికి నౌపడ యువత కొందరు నౌపడ విద్యుత్ సబ్ స్టేషన్‌కు చేరుకున్నారు. రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా ఉందని, నౌపడకు ఎందుకు లేదని నిలదీశారు. దీనికి సిబ్బంది సమాధానం చెప్పకుండా సబ్ స్టేషన్ లోపలికి సిబ్బంది వెళ్లిపోయి నౌపడ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఇద్దరు కానిస్టేబుళ్లు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ప్రతిరోజు రాత్రిపూట కరెంటును తీసివేస్తున్నారని అడగడానికి వచ్చామని నౌపడ ప్రజలు చెప్పడంతో అందులో ఓ కానిస్టేబుల్ వారిపై దురుసుగా వ్యవహరించాడు. సోలార్, ఇన్వర్టర్ ఏర్పాటు చేసుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంతో పాటు, విద్యుత్ కోసం ఎలా గొడవ చేస్తారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మేము కరెంటు బిల్లులు చెల్లిస్తున్నామని, రాత్రిపూట కరెంటు ఎందుకు కట్ చేస్తున్నారో అడగడానికి వచ్చామని, వాళ్ల తరపున మీరే సమాధానం చెబుతున్నారని మా బాధలు మీకు పట్టవా అంటూ పోలీసులను స్థానికులు ప్రశ్నించారు. మేం గొడవ పడేందుకు రాలేదని, విద్యుత్ సరఫరా ఎప్పుడు పునరిద్ధరిస్తారని అడిగేందుకు వచ్చామని, ఫోన్లు చేస్తే వారు ఎత్తకపోవడంతోనే ఇక్కడకు వచ్చామని కొందరు యువత చెప్పినప్పటికీ ఇద్దరు కానిస్టేబుళ్లలో ఒకరు మాత్రం వారిపై దురుసుగా వ్యవహరించారు. ఆ తర్వాత కరెంటు రావడంతో అందరూ వెనుదిరిగారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

### హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



**జి.సిగడాం, జూన్ 27(వార్త):** హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని శ్రీనివాసనంద స్వరస్వతీ స్వామీజీ అన్నారు. శనివారం టంకాల దిగ్గువలసలోని అంబేద్కర్ కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయ భూమి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం ఎంతో గొప్ప దని, దాని విశిష్టత ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా యువతరానికి తెలియజేయాల న్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత, రామాయణం,హిందూ ధర్మక, గ్రాంథిక పుస్తకా లను, ప్రసంగాలను అభ్యసించే విధానాలను అలవర్చుకోవాలని, అప్పుడే మరింత హిందూ ధర్మం నైపుణ్యాలు తెలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు టంకాల మౌళీశ్వరరావు, అప్పల నాయుడు, కిషోర్, గోపాల్, రామకృష్ణ, విజయ బాబు, రథానందం, టంకాల సత్యనారాయణ, ఆనందపురం గ్రామ నీటి సంఘం అధ్యక్షులు చిత్తిరి తిరుపతిరావు, పొగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### కాపాడమ్మా దుర్గమ్మా..!



**జి.సిగడాం, జూన్ 27(వార్త):** భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమ్మ తల్లి అని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. పెంట గ్రామంలో వెలసియున్న శ్రీ దుర్గమ్మ తల్లి తృతీయ జాతర మహోత్సవంలో భాగంగా శనివారం రెండవ రోజు అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ముగ్రాటలు సమర్పించుకొని భక్తి శ్రద్ధలతో పసుపు కుంకుమలతో పూజలు చేసి ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

### రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట



**జి.సిగడాం, జూన్ 27(వార్త):** ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతోనే రోడ్డులు అబివృద్ధి సాధ్యమని గ్రామ నీటి సంఘ అధ్యక్షుడు చిత్తిరి తిరుపతిరావు అన్నారు. శనివారం ఆనందపురం పంచాయితీ అబోతుల పేట గ్రామంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు చోరవతో రూ.5 లక్షల వ్యయం తో గ్రామంలో ఎస్సీ కోలణీ వైపు రహదారి సీసీ రోడ్డు, రిటనింగ్ వాల్ అబివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో సాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుదన్నారు.


### సిద్ధార్థలో విద్యార్థులకు అవగాహన




**మందస, జూన్ 27(వార్త):** మందస మండలంలోని హరిపురం గల సిద్ధార్థ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మందస మండల ఎస్సై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం మరియు సమాజంపై కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దున్న తాతారావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.

### నేడు మందసలో ట్రీగార్డుల ఏర్పాటు

**మందస, జూన్ 27(వార్త):** మందస పట్టణంలోని మొక్కలకు ఐరన్ ట్రీగార్డులను ఈ నెల 28న ఏర్పాటు చేస్తున్నట్టు గో గ్రీన్ మందస ప్రతినిథులు చెప్పారు. 28(ఆదివారం) సాయంత్రం 4.30గంటలకు బోయివీధి హైస్కూల్ జంక్షన్ వద్ద ఉన్న డివైడర్ పై మందస సబ్ ఇన్ స్పెక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. అనంతరం గత ఏడాది నాటిన మూడు మొక్కలకు రక్షణ గార్డులు ఏర్పాటు చేయబడుతుందన్నారు. గో గ్రీన్ సభ్యులందరూ తప్పనిసరిగా బోయివీధి హైస్కూల్ జంక్షన్ వద్దకు చేరుకోవాలని వారు కోరారు.



## పాతపట్నం టీడీపీలో..

# భగ్గుమన్న విభేధాలు

- రోడ్ల నాణ్యత లేమిపై దృష్టి పెట్టిన వెంకటరమణ, అనుచరులు
- తట్టుకోలేకపోతున్న ఎమ్మెల్యే వర్గీయులు
- మీడియా వేదికగా పరస్పరం విమర్శించుకుంటున్న కలమట, మామిడి వర్గాలు
- ఒకరిని ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్న వైనం

(ఎల్ఎన్ పేట)

పాతపట్నం టీడీపీలో విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితం ఎల్ఎన్ పేట మండలంలో పలు రోడ్లను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ, మాజీ ఎంపీపీ కొమరాపు తిరుపతిరావు, మండల నాయకులు శివ్వాల కిశోర్‌బాబు, తోనంగి వెంకటరమణ, కుంచాల నాయుడు, గుండపు రాము, ముద్దాడ చిట్టిబాబు, గొలివి వాసుదేవరావు తదితరులతో కలిసి పలు రోడ్లను పరిశీలించారు. చొర్లంగి, జాడుపేట, బొత్తాడసింగి, మురగడ లోయ, సూదిరాయిగూడ, బాలేరు తదితర రోడ్లను నాణ్యత లేకుండా నిర్మిస్తుండడంపై మండిపడ్డారు. సంబంధిత అధికా రులు, కాంట్రార్లను నిలదీశారు. దీంతో అధికారులు ఏమి చెప్పలేక నీళ్లు నమిలారు. ఫిబ్రవరిలో రోడ్లకు శంకుస్థాపన చేసినా నేటి వరకు పూర్తిచేయకుండా సంబంధిత అధికా రులు, కాంట్రాక్టర్లతో కుమ్మకై పనులు నాణ్యత లేకుండా చేపడతారా... ఈ బాగోతం ప్రజలు అందరూ గమనిస్తూనే ఉన్నారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఊరుకునేది లేదని , పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని కలమటతో పాటు మండల నాయకులు వారిని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే ఎమ్మెల్యే మామిడి, కలమట మధ్య ఉప్పు..నిప్పులా ఉన్న విబే ధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దీంతో ఎమ్మెల్యే మామిడి వర్గానికి చెందిన వారు కలమటపై విమర్శలకు దిగారు. మామిడి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయన వర్గానికి చెందిన యంబరాం మాజీ సర్పంచ్ వెలమల గోవిందరావు కలమటపై ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో కల మటపై విమర్శలతో వీరి మధ్యన పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరుకున్నారు. ఇదిలా ఉంటే కలమట వర్గానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు శివ్వాల కిశోర్ బాబు, పలువురు మండల నాయకులతో కలిసి ఎల్ఎన్ పేట జంక్షన్‌లో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ మామిడి వర్గ నాయకులను టార్గెట్ చేస్తూ విమర్శలను ఎక్కు పెట్టారు. నీవు ఒక మాజీ సర్పంచివి.. నీకు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణపై విమర్శించే దమ్ము నీకుందా...నీవు, మీ పెద్ద నాయకులు చేసిన అభివృద్ధిపై రోజూ డప్పు వేసుకొని తిరుగు. కానీ లేనిపోని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే అనుచరుడు వెలమల గోవిందరావును హెచ్చ రించారు. గుర్తుపెట్టుకో.. మీరు చేసిన అభివృద్ధి ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు...మేము జిల్లా మాజీ అధ్యక్షుడితో కలిసి రోడ్లు పనులను పరిశీలన చేస్తే మేము ఫొటోలకు పరిమితమవుతామా... రోడ్లు నాణ్యత లేకుండా ఎలా నిర్మిస్తారని అధికారులను, కాంట్రాక్టర్లను మేము ప్రశించకూ డదా చెప్పండి అని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో ఇటీవల కండువాలు కప్పుకున్నదెవరు... చెప్పండ య్యా.... మీరు వైకాపా నాయకులా మేము వైకాపా నాయకు లమా చెప్పండి అంటూ గర్జించారు. ఏది ఏమైనా నాణ్యత లేని రోడ్లపై అధిష్టానం దృష్టికి తీసుకొనివెళ్తాం.. మేము తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులం. మీరు మాకు విమర్శించేదేంటి, ఇక నుంచి మా నాయకుడు కలమటను విమర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై మామిడి వర్గం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



చొర్లంగిలో రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, అనుచరులు



మీడియాతో మాట్లాడుతున్న కలమట వర్గీయులు

## పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి




**పలాస, జూన్ 27 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జులై 10 ,11 తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాస, కాశీబుగ్గలో టీకేఆర్ కళ్యాణ మండపంలో జరగనున్నాయి. ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సూది కొండ కాలనీ పిడియస్ యు కార్యాలయంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా, జాతీయంగా వస్తున్నటువంటి మార్పులు అదే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో అవలంబిస్తున్నటువంటి విధానాలపై ఈ శిక్షణా తరగతులు ఉంటాయని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు అవుతుందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఆనాడు హామీ ఇచ్చారని, నేడు ప్రభుత్వ రంగ సంస్థల కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగి పోతుందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతుందని, రాష్ట్రవ్యాప్తశీగా బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 నేటికీ రద్దు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 10400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు నేడు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని, రేషనలైజేషన్ పేరు గిరిజన ఆశ్రమ పాఠశాలలను కుదించడం తగదని అన్నారు. విద్యారంగా అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను 3000 రూపాయలకు పెంచాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు శంకర్, దయానంద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు



**మందస, జూన్ 27(వార్త):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు జ్ఞాపకార్థం మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక విద్యావేత్త, నిఫ్స్ ఫౌండర్ సునీల్ మహంతి సహకారం అందించి, పోటీల నిర్వహణకు సహకరించడమే కాకుండా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన చిద్విలాసి సాహు, పల్లవి, అర్చిత, ప్రత్యూష, శ్రీజ, లక్ష్మీనాయక్ తదితర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు సునీల్ మహంతికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం, వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సునీల్ మహంతి సేవలను అభినందిస్తూ తమ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విద్యా వికాస కార్యక్రమాలకు ఆయన సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబానికి అండగా లొడగల



**పలాస, జూన్ 27 (వార్త):** కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి అకాల మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ శనివారం చేయూతనందించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సెగిడి వీధికి చెందిన దాసరి బుజ్జి (36) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య శకుంతల, ఇద్దరు కుమారులు రాజశేఖర్ (9వ తరగతి), తరుణ్ (7వ తరగతి) ఉన చదువుతుండగా కుటుంబానికి ప్రధాన ఆధారం అయిన బుజ్జి మరణంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న లొడగల కామేశ్వరరావు యాదవ్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సేవా స్ఫూర్తితో బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అనంతరం తన వంతు సహాయంగా బియ్యం, కూరగాయలు, నూనెతో పాటు నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ఆయన పేర్కొన్నారు. దివంగత బుజ్జి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పలాస పట్టణ ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, గురిటి సూర్యనారాయణ, బద్రి గోపాలరావు, దడియాల నరసింహులు, బాడాడ ఉమాకాంత్, కొత్త సత్యం, తారక రమేష్, బమ్మిడి రవితేజ, కుటుంబ సభ్యులు, స్థానికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



**సారవకోట, జూన్ 27(వార్త):** పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుస్మిత కోరారు. శనివారం బొంతు గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సుస్మిత మాట్లాడుతూ, జననం నుంచి ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధి నిర్మూలనలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యం ఎంతో కీలకమని, చిన్నారులను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీ ద్వారా సందేశాలు అందించారు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్య సిబ్బంది వివరించారు. అదే విధంగా సారవకోట గ్రామంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. గ్రామస్తులు చిన్నారులను పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంకుజోడు ప్రధాన కాలువ పూడికతీత పరిశీలన

**మందస, జూన్ 27(వార్త):** సంకుజోడు ప్రధాన కాలువ పూడికతీత పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. మందస మండలం కొండలోగాం నుంచి సంకుజోడు వరకు జరుగుతున్న ప్రధాన కాలువ పూడికతీత పనులను మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన శనివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును, వేగాన్ని ఆయన క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బావన దుర్యోధన, స్థానిక నాయకులు బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఈ పనులపై సోషల్ మీడియా వేదికగా కొంతమంది కావాలనే అవాస్తవాలను, దుష్ప్రచారాన్ని సాగిస్తున్నారని.. వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కాలువ పూడికతీత పనులు చాలా చక్కగా, ఎక్కడా రాజీ పడకుండా ముమ్మరంగా సాగుతున్నాయని వారు స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పనులపై ఇలాంటి అవాస్తవాలు మాట్లాడటం, లేనిపోని వదంతులు సృష్టించడం సరికాదని వారు మండిపడ్డారు. రైతాంగానికి మేలు చేసేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు ముంజేటి చంద్రశేఖర్, ఔగాన ఈశ్వరరావు, బి.మురళి, స్థానిక రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పలాసలో ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి

- బెల్ట్ షాపుల రద్దు చేయాలి
- దువ్వాడ శ్రీధర్ (బాబా) డిమాండ్

పలాస, జూన్ 27 (వార్త): పలాస నియోజకవర్గంలోని మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర అంటే ఎమ్మార్పీని ఉల్లంఘిస్తూ సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నారని, వెంటనే ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పాఠశాలలు, దేవాలయాల సమీపంలో సైతం మద్యం అందుబాటులో ఉంచి యువతను, కుటుంబాలను నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ అమలు కోసం జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక తనిఖీ బృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించాలని, అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేసి నిర్వాహకులపై, వారికి సహకరిస్తున్న లైసెన్స్‌డ్ షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ శాఖ నుంచి సరైన స్పందన లేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే మద్యం మాఫియా రెచ్చిపోతోందని విమర్శించారు. ఎమ్మార్పీ అమలు, బెల్ట్ షాపుల రద్దు జరిగే వరకు తన న్యాయపోరాటం కొనసాగుతుందని, అవసరమైతే బాధితులతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామని శ్రీధర్ బాబా స్పష్టం చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# హరిపురం అభివృద్ధికి భారీగా నిధులు

**-ఇండోర్ స్టేడియం, సెంటర్ డివైడర్ మంజూరుపై హర్షం**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,**

**- ఎమ్మెల్యే శిరీషకు మండల టీడీపీ ధన్యవాదాలు**



**మందస, జూన్ 27(వార్త):** మందస మండలంలోని హరిపురం ప్రాంత ప్రజల, యువత చిరకాల స్వప్నం నెరవేరిందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. హరిపురం గ్రామంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.1.50 కోట్లు(కోటి యాభై లక్షలు), అలాగే హరిపురం-బాలిగాం జంక్షన్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు సెంటర్ డివైడర్, సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం రూ.56 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. మందస మండలంలో యువతకు సరైన క్రీడా మైదానం లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణంతో బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడల్లో గ్రామీణ యువత తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప అవకాశం లభిస్తుందన్నారు.

## విద్యార్థుల భద్రతకు పెద్దపీట

హరిపురం-బాలిగాం జంక్షన్ పరిధిలో నాలుగు జూనియర్ కాలేజీలు, మూడు హైస్కూళ్లు ఉన్నాయని, దీనివల్ల నిత్యం విద్యార్థులు, ప్రజలతో ఈ ప్రధాన రహదారి ఎంతో రద్దీగా ఉంటుందని గుర్తు చేశారు. ట్రాఫిక్ పెరిగి నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మంజూరైన సెంటర్ డివైడర్, సెంటర్ లైటింగ్ తో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

## నాయకత్వానికి కృతజ్ఞతలు

ఈ రెండు కీలకమైన పనులను మంజూరు చేయించడంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. మందస మండల ప్రజల తరఫున, కూటమి నాయకుల తరఫున వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన పనులకు అధికారులు త్వరితగతిన టెండర్లు పిలిచి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కొర్ల కన్నారావు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, తమరియా భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, భైరిశెట్టి గున్నయ్య, ముంజేటి చంద్రశేఖర్, దుంకురు తిరుపతి, తమ్మినేని ధనుంజయ, రాజాన మహేశ్, నవీన్ యాదవ్, ఔగాన ఈశ్వరరావు, మండల మాధవరావు, సిర్ల కృష్ణారావు, రౌతు చిరంజీవి, సిరిపురం వెంకటరావు, కొత్ర వైకుంఠరావు, కొత్ర ఆనందరావు, బతకల జోగారావు, బి.జోగారావు, ఎ.జోగారావు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై అవగాహన




**సోంపేట, జూన్ 27(వార్త):** పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలంటూ కొర్లాం, సోంపేట ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఆయాచోట్ల శనివారం అవగాహన ర్యాలీలను వైద్య సిబ్బంది నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రోషిని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం నాడు ఐదేళ్ల లోపు పిల్లలకు ఇచ్చే పోలియో చుక్కలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల,వసంతకుమారి,సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు. సోంపేట కార్యక్రమంలో రాజేశ్వరి, సుజాత, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

## కోదండ రాముని ఆదర్శాలే నేటి సమాజానికి శ్రీరామరక్ష



**పలాస, జూన్ 27 (వార్త):** పలాస మండలం కైజోల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా జరగగా, ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కోదండం ధరించిన శ్రీరాముడు అధర్మాన్ని అణచి ధర్మాన్ని నిలబెట్టిన ధర్మస్వరూపుడని, ఈ ఆలయం కైజోల గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా, ఆపదలో ఉన్నవారికి అభయమిచ్చే రక్షణ కవచంగా విరాజిల్లుతుందని, సీతా లక్ష్మణ హనుమత్ సమేతుడైన కోదండ రాముని నిత్య దర్శనం సర్వపాపాలను హరించి కుటుంబంలో సుఖశాంతులు, ఐకమత్యం కలిగిస్తుందని, తండ్రి మాట జవదాటని రాముని పితృవాక్య పరిపాలన, సోదర ప్రేమ, ఏకపత్నీ వ్రతం, ప్రజారంజక పాలన వంటి సత్యం, ధర్మం, త్యాగం, న్యాయం అనే ఆదర్శాలు నేటి యువత ప్రతి ఒక్కరూ అలవర్చుకుని ధర్మమార్గాన్ని వీడకుండా జీవించాలని నాలుగు కీలక అంశాలను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పలాస వైయస్సార్సీపీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కాషాయ కండువాలతో ఉత్సాహంగా పాల్గొని, మాజీ మంత్రికి శాలువాలతో ఘన సత్కారం చేశారు. అనంతరం భక్తులంతా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు




**సోంపేట, జూన్ 27(వార్త):** సోంపేట పట్టణంలో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక కీ. శే. ముప్పన దండాసి స్మారక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 29 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన ప్రోత్సహకాల పంపిణీ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బల్ల బాబురావు మాట్లాడుతూ హై స్కూల్ విద్యలో ప్రతిభావంతులైన విద్యార్థులను మరింతగా ప్రోత్సహించే లక్ష్యంతో అనేక ఏళ్లుగా ఇటువంటి కార్యక్రమాన్ని సంఘ వ్యవస్థాపకులు ముప్పన దండాసి మాస్టారు స్ఫూర్తితో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. వచ్చే ఏడాది 8,9 తరగతుల్లో ఉత్తమ విద్యార్థులకు కూడా బహుమతులు అందజేస్తామని అన్నారు. నగదు ప్రోత్సాహకాల కోసం స్వర్గీయ భారతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త సూరయ్య 19 వేల రూపాయలు, అలాగే విశ్రాంత ఉద్యోగుల సంఘం పదివేల రూపాయలు సమకూర్చడంతో ఈ మొత్తాన్ని ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థులకు అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సంజన రైక, శ్రీ ప్రియ పండా, ఏపూరు రోహిణి అలాగే బాలికోన్నత పాఠశాల విద్యార్థులు అనసూయ తనుజ,గురుమూరు లోహిత, సురంగి తన్మయి లకు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విశ్రాంత ఉద్యోగుల సంఘాన్ని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ,దుద్ది వీర్రాజు, అభిమన్యు పాణిగ్రహి, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంబుగాం జడ్పీహెచ్ఎస్‌లో ఎన్నికలు




**మందస, జూన్ 27(వార్త):** మందస మండలంలోని అంబుగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్పీఎల్, సీపీఎల్ ఎలక్షన్స్ ను నిర్వహించారు. వాస్తవ ఎన్నికల మాదిరిగానే వీటిని నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ఈ ఎన్నికలను ఘనంగా నిర్వహించడానికి ముఖ్య కారణం విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగాన్ని, విలువను తెలియజేయాలనే ఉద్దేశమని ఉపాధ్యాయులు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో 9వ తరగతి విద్యార్థులు ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రథమ ఎస్పీఎల్‌గా 9వ తరగతి విద్యార్థిని తడేలు స్రవంతి, ద్వితీయ ఎస్పీఎల్‌గా కద్దాల లోహిత్ విజయం సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సీతమ్మ, కోదండరాం, మాలతిలత, భాస్కరరావు, దీనబంధు, ధనరాజు, కిరణ్‌కుమార్, ప్రమీల, తేజేశ్వరరావు, నరసింహులు పాల్గొన్నారు.

## కిడ్నీ మహమ్మారికి మరొకరి బలి



**పలాస, జూన్ 27 (వార్త):** బొడ్డపాడు గ్రామానికి చెందిన బైనపల్లి ఆదిమ్మ గత కొద్ది రోజులగా డయాలసిస్ పలాస కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్ లో చేస్తుండే వారు. అకస్మికంగా అకాల మరణం పొందడం అత్యంత దిగ్భ్రాశీతి కి గురిచేసింది. ఏది ఏమైనా ప్రభుత్వం పరంగా కొన్ని నియమ నిబంధనలు పాటిస్తున్న బాడీస్ సహకరించకపోవడం వలన ఇలాంటి విషాద వార్తలు వస్తున్నాయని పలువురు అంటున్నారు. ఉద్దానం ఎప్పుడు ఒక్క కిడ్నీ పేషెంట్ లేకుండా ఏరోజు వస్తుందో వేచి చూడాలని,ఎన్టీఆర్ సుజలా పథకం ద్వారా చాలా మార్పు వచ్చిందని, కిడ్నీ భూతానికి మరో వ్యక్తి మృతి చెందడం బాధాకరంగా ఉందని మండల తెలుగు యువత అధ్యక్షులు ఢిల్లీ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన ఆమెకు ఢిల్లీ రావు ప్రగాఢ సంతపాన్ని తెలియజేస్తు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

## హనుమంతుని సేవా తత్పరత ఆదర్శం



**పలాస, జూన్ 27 (వార్త):** కైజాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరగగా, ఈ పవిత్ర కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు శనివారం పాల్గొని స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఆంజనేయ స్వామి భక్తి గురించి మాట్లాడుతూ "హనుమంతుడు ఫలితాన్ని ఆశించకుండా శ్రీరామునికి చేసిన నిస్వార్థ సేవ నేటి సమాజానికి ఆదర్శమని, సంకట సమయంలో బలంతో పాటు బుద్ధితో కార్యం సాధించిన హనుమంతుని వివేకాన్ని యువత అలవర్చుకోవాలని" పిలుపునిచ్చారు. ఆలయాన్ని పూలమాలలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో తరించారు. ఈ కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎక్స్ సర్పంచ్ బత్తిని అప్పలస్వామి, తాజా మాజీ సర్పంచ్ కొర్ల సంతు, బత్తిని వెంకట్రావు, బుడత అప్పారావు, ఎంపీటీసీ మద్దు రాంప్రసాద్, వల్లభ వైకుంఠ రావు, అగ్రికల్చర్ బోర్డు మాజీ చైర్మన్ గొర్రెల వేణు, పి. ప్రభాకర్ రావు, డి. నాగభూషణరావు, పి. పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పైడిగాంకు పోదాం యాత్ర

**- సాగునీటి సమస్యపై వైసీపీ పోరాటం**



**సోంపేట, జూన్ 27(వార్త):** సోంపేట, కంచిలి,మందస మండలాల రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరుగా పేర్కొనే పైడిగం ప్రాజెక్టును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో వ్యవసాయనికి తీవ్ర సాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంటలకు నీరు సరిగ్గా అందగా ప్రతి ఏటా రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. పైడిగం ప్రాజెక్టు ద్వారా సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని రైతన్నలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అది అరణ్యరోదన గానే మిగిలిపోతుంది. ప్రతి ఏటా ఖరీఫ్ సాగు ప్రారంభంలో పైడిగం ప్రాజెక్టు వద్దకు వెళ్లి నేతలు నీటి సరఫరా ప్రారంభిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప పైడిగం ప్రాజెక్టు అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసిన దాఖలాలు లేవు. ఇటు తెలుగుదేశం ప్రభుత్వంలోనూ అటు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అలాగే వైసిపి ప్రభుత్వం లోను మొక్కుబడిగా నిధులు విధుల్చుతు నామమాత్ర పనులు చేపట్టడం తప్ప సుమారు పదివేల ఎకరాలలో సాగుకు అవసరమైన నీరందించేందుకు చిత్తశుద్ధితో పాలకులు కృషి చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనేక సమస్యలతో సతమతమవుతున్న పైడిగం ప్రాజెక్టు తీరు మార్చాలన్న ప్రధాన లక్ష్యంతో ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆదివారం ఉదయం బేసి రామచంద్రపురం నుంచి పైడిగం గ్రామం వరకు రైతు యాత్ర నిర్వహించేందుకు నిర్ణయించారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ యాత్ర ద్వారా ప్రాజెక్టు వద్దకు పెద్ద సంఖ్యలో వెళ్లి నిరసన తెలిపి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. 1960 దశకంలో ఏర్పాటైన పైడిగం ప్రాజెక్టు అనేక దశాబ్దాలుగా నిర్ల క్ష్యానికి గురవుతూ వస్తుంది. ప్రధాన కాలు వల్లో ప్రతి ఏటా పేరుకు పోతున్న పూడిక తొల గింపు పెద్ద సమస్యగా మారింది. అనేక చోట్ల ఏర్పాటు చేసిన సైపున్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రాజెక్టు గోడలు 2017 లో సంభవించిన తిత్లి తుఫానుకు విపరీతంగా దెబ్బతి న్నాయి. కాలువల్లో ఏర్పాటుచేసిన షట్టర్లు కూడా సిద్ధిలమైపోయాయి . ఈ నేపథ్యంలో కాలువల ద్వారా సాగునీరు ప్రవాహం సక్రమంగా జరగక రైత న్నలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. దీనికి తోడు ఈ ప్రాజెక్టు ఎగువున ఒడిస్సా భూభాగంలో అక్కడ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చేపడుతున్న ఇదే మహేంద్ర తనయ నదిపై అక్రమ నిర్మాణాలు మన ప్రభుత్వం అడ్డుకోవడంలో విఫలమవుతుంది. దీంతో సక్రమంగా నీరు అందక ప్రాజెక్టు ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడింది. ఇటువంటి ప్రధాన సమస్యపై పోరాడి సాధించాలన్న పట్టుదలతో శ్యాం ప్రసాద్ రెడ్డి సాగిస్తున్న ప్రయత్నం సఫలీకృతం కావాలని రైతులు కోరుకుంటున్నారు.

## నేడు పల్స్ పోలియో



**పలాస, జూన్ 27 (వార్త):** పలాస మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం కోసం అవగాహన ర్యాలీ శనివారం సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ మౌనిక మాట్లాడుతూ 0-5 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలు ఆదివారం పోలియో వేసుకోవాలని కోరారు. తీవ్రమైన వ్యాధి ఉంటే తప్ప.. సాధారణ జలుబు, జ్వరము ఉంటే వేసుకోవచ్చునని తెలిపారు. మీ పరిసర ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలకు వివరాలు కనుక్కొని పిల్లలకు పోలియో చుక్కలు విధిగా వేసే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆదమ్మ, పి హెచ్ ఎన్ లలితాంబ, పలాస ఏపీ ఎన్జీవో అధ్యక్షులు బోనెల గోపాల్, ఎల్ కామేశ్వరరావు, ఈశ్వరరావు, ఆశ, లోలాక్షి, త్రివేణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ కార్తీక్‌కు అభినందనలు

**జలుమూరు, జూన్ 27(వార్త):** జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన జలుమూరు మండలం పాగోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి జీవన్ కార్తీక్‌కు శనివారం పాఠశాలలో ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన విజయాన్ని ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్ కార్తీక్ తన విజయ ప్రయాణంలోని అనుభవాలను పంచుకున్నారు. లక్ష్యసాధనకు క్రమశిక్షణ, నిరంతర సాధన, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన విజయానికి ప్రధాన కారణం తన తల్లి రోహిణి అని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి తనకు ప్రోత్సాహం అందిస్తూ ప్రతి అడుగులోనూ అండగా నిలిచారని ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పన్న, ఉపాధ్యాయుడు పరసయ్య అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యానని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీవన్ కార్తీక్ సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని జీవన్ కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపారు,.



# ఊర్వశి హంతకులను కఠినంగా శిక్షించాలి

**గొల్లవూరులో ప్రజా సంఘాల ఆందోళన**

**సోంపేట, జూన్ 27(వార్త):** గొల్లవూరు గ్రామంలో ఇటీవల హత్యకు గురైన పిన్నింటి ఊర్వశి హంతకులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఉద్దానం గ్రామాలకు చెందిన ప్రజా సంఘాలు శనివారం ఆ గ్రామంలో ఆందోళన చేపట్టారు. సోంపేట, మందస, వజ్రపు కొత్తూరు, పలాస తదితర మండలాల నుంచి వచ్చిన ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు సుమారు 500 మంది గొల్లవూరు గ్రామంలో సమావేశమై హత్యకు పాల్పడిన పిన్నింటి శివకుమార్ను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుమా రెండు నెలల క్రితం ఊర్వశి భర్త కూడా అన్నదమ్ములు పెట్టిన చిన్నపాటి ఆస్తులు తగాదా విషయంలో మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. ఈ చావుకు కూడా పరోక్షంగా అన్నదమ్ములే కారణమని ఆరోపించారు. కేవలం నాలుగు సెంట్లు భూమి కోసం సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శివకుమార్ సృష్టించిన తగాదాలు, చేపట్టిన మారణకాండ క్షమించరాని నేరమని అన్నారు. మృతురాలు ఊర్వశిని చిత్రహింసలు పెట్టి అత్యంత పాసవికంగా,మానవ మృగంలా దారుణంగా హత్య చేశాడని అన్నారు. మానవ సమాజం ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు. తల్లితండ్రులను కోల్పోయి అనాథలైన వారి బిడ్డలను ఎవరు సంరక్షిస్తారని ప్రశ్నించారు. వాళ్లు పెంపకం, భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. ఈ బిడ్డలకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరు న్యాయం చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ,ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా అధ్యక్షులు మద్దెల ధర్మారావు,అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధి జోగు కోదండరాం, ధనలక్ష్మి, అఖిలభారత రైతు కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, గోరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, ప్రజా కళామండలి ప్రతినిధి నీలకంఠం,పిడిఎం నాయకులు గంగయ్య, స్థానిక మాజీ సర్పంచులు వంకలు నాగభూషణం, పిన్నింటి ఈశ్వరరావు, దాసరి తిరుపతిరావు,మామిడి సింహాద్రి,బత్తిని లక్ష్మణరావు,రాపాక చిన్నారావు,గూడ తాతారావు, అంకల సరస్వతి, దాసరి శ్రీరాములు, జుత్తు వీరాస్వామి పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో దాసునాయుడు

**నరసన్నపేట, జూన్ 27(వార్త):** మాటివలస గ్రామంలో నిర్వహించిన వివాహ వేడుకలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మండదాసు నాయుడు శనివారం పాల్గొన్నారు. రమణమూర్తి వివాహ కార్యక్రమానికి హాజరైన మండదాసు నాయుడు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బంధువులు, అభిమానులు, స్థానిక నాయకులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ కొంతసేపు గడిపారు. అనంతరం వివాహానికి హాజరైన అతిథులను పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక, కుటుంబ కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

# దొంగలు..బాబోయ్.. దొంగలు

- ఉద్దానం వాసుల బెంబేలు
- మహిళలే టార్గెట్
- పూండిలో వరుస చైన్ స్నాచింగ్‌లు

**పలాస, జూన్ 27 (వార్త):** పూండి గ్రామంలో వరుసగా రెండు రోజుల వ్యవధిలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలు స్థానిక ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. దీంతో ఉద్దానం వాసులు దొంగలు భయంతో ఉద్దాన ప్రాంతం భయాందోళన చెందుతున్నారు. మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దుండగులు దాడులకు పాల్పడుతూ సుమారు 7.5 తులాల బంగారాన్ని అపహరించినట్లు సమాచారం. పూండి-పీఎంపురం రోడ్డులో నివాసముంటున్న కోట లక్ష్మి ఇంటి ముందు పూలు కోస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ క్రమంలో ఆమెను తోసివేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. అదే తరహాలో శుక్రవారం మధ్యాహ్నం పూండి కర్రెమ్మ వీధిలో దున్న జగదీశ్వరిపై దుండగుడు దాడి చేసి బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆమెను బలంగా నెట్టి, మెడలో ఉన్న సుమారు 55 గ్రాముల (దాదాపు 4.5 తులాలు) బంగారు పుస్తెలతాడును అపహరించి పారిపోయాడు. స్పృహ కోల్పోయిన జగదీశ్వరిని కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స అందించారు. పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి. నిహార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించి సీసీ టీవీ ఫుటేజీలను తనిఖీ చేశారు. నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ టీవీ దృశ్యాల్లో స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వజ్రపుకొత్తూరు ఎస్ఐ తెలిపారు. వరుసగా చోటుచేసుకున్న ఈ ఘటనలతో పూండి గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ, రాత్రి వేళలతో పాటు పగటి సమయంలో కూడా పోలీసు పహారా పెంచాలని కోరుతున్నారు.



చైన్ తెంచుకెళ్లిపోయారని విలపిస్తున్న బాధిత మహిళ

## మన బడి..మన భవిష్యత్‌లో పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యం



**జలుమూరు, జూన్ 27(వార్త):** 'మనబడి--మన భవిష్యత్తు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కేఎల్ఎన్ మూర్తి తెలిపారు. శనివారం జలుమూరు మండలం పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, అక్కడ నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిని అధికారులను అడిగి తెలుసుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు 'మనబడి--మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు కోటిబాబు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో కేజీబీవీ నూతన భవనాల ప్రారంభం



**సారవకోట, జూన్ 27(వార్త):** సారవకోటలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినుల కోసం రూ.1.23 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన వసతి గృహ భవనాలను వచ్చే నెల రెండో వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్వశిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) డీవీఎన్ మూర్తి తెలిపారు. శనివారం ఆయన సారవకోటలో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ వసతి గృహ భవనాలను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులకు మెరుగైన వసతి, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థినులు అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన వసతి గృహంలో ఉండే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేసి, వచ్చే నెల రెండో వారంలో భవనాలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు డీవీఎన్ మూర్తి వెల్లడించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

## ఉద్యోగులకు ఫిజియోథెరపీపై అవగాహన

- మొబైల్ అధిక వినియోగంతో వచ్చే ఆరోగ్య సమస్యలపై వైద్యుల వివరణ

**సారవకోట, జూన్ 27(వార్త):** ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోజువారీ జీవనశైలిలో చిన్నచిన్న మార్పులతో అనేక శారీరక సమస్యలను నివారించవచ్చని ఫిజియోథెరపీ నిపుణులు సూచించారు. శనివారం సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉద్యోగులకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫిజియోథెరపీ వైద్యులు ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చొని పనిచేయడం, మొబైల్ ఫోన్లను అధికంగా వినియోగించడం వల్ల మెడ, వెన్ను, భుజాల నొప్పులతో పాటు మానసిక ఒత్తిడి, కంటి సమస్యలు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. రోజువారీ వ్యాయామం, సరైన కూర్చునే విధానం, మధ్య మధ్యలో శరీరానికి విశ్రాంతి కల్పించడం వంటి అలవాట్లను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఉద్యోగులు తమ పని సమయంలో ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారవకోట ఎంపీడీవో మోహన్ కుమార్ పాల్గొని ఉద్యోగులు ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# రామ సూర్యుడే గ్రామ సూరీడు

- రూ.65 వేలతో శ్రీముఖలింగం జెడ్పీ హైస్కూల్‌కు నీటి సదుపాయం కల్పించిన సోషల్ వర్కర్ సుర రామ సూర్యారావు



**జలుమూరు, జూన్ 27(వార్త):** శ్రీముఖలింగంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యకు సోషల్ వర్కర్, రిటైర్డ్ కమ్యూనికేషన్స్ సీఐ సుర రామ సూర్యారావు తన సొంత నిధులతో శాశ్వత పరిష్కారం చూపారు. నీటి సదుపాయం లేక హైస్కూల్‌లో చదువుతున్న సుమారు 300 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వంట సిబ్బంది కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సూర్య ప్రభాకర్ రావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సుర రామ సూర్యారావు వెంటనే పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం తన తల్లిదండ్రులు కీర్తిశేషులు సురా వెంకటప్పెడు మాస్టర్ మరియు పారమ్మ జ్ఞాపకార్థం అక్షరాల రూ.65 వేల సొంత నిధులతో కొత్త మోటార్ ఏర్పాటు చేయడంతో పాటు, వంట సిబ్బంది విద్యార్థులకు ఆహారం వడ్డించేందుకు అదనంగా రేకుల షెడ్డు నిర్మించి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి. సూర్య ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. సమాజ సేవా దృక్పథంతో దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు సహకరిస్తే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. సుర రామ సూర్యారావు చేసిన సేవను వారు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మరియు శ్రీకాకుళం పార్లమెంట్ కంటెస్టెంట్ (2024) నాయుడుగారి రాజశేఖర్, శ్రీముఖలింగం మాజీ ఉపసర్పంచ్ గుంట కర్ణ వీరుడు, మాజీ వార్డు మెంబర్ పైడి సింహాచలం, శ్రీముఖలింగం గ్రామ యువత ఉపాధ్యక్షుడు పూర్ణచంద్ర, ఇంజనీర్ సురా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# తేజ్‌కుమార్‌కు రెడ్‌క్రాస్ అవార్డు




**సారవకోట, జూన్ 27(వార్త):** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్కు రెడ్‌క్రాస్ సంస్థ ప్రత్యేక అవార్డును అందజేసింది. గత మూడు సంవత్సరాలుగా తన జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్న ధర్మాన తేజ్‌కుమార్ సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ ఏడాది జూన్ 17న తన జన్మదినం సందర్భంగా కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 231 యూనిట్ల రక్తం సేకరించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మాట్లాడిన ధర్మాన తేజ్‌కుమార్, తనకు లభించిన ఈ అవార్డును రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్క రక్తదాతకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తమ పిలుపునకు స్పందించి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా తన జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలను విజయవంతం చేస్తున్న యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత మంది యువత రక్తదానానికి ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# పల్స్‌పోలియో విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు

- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారుల పిలుపు
- జలుమూరు పీహెచ్‌సీలో సిబ్బందితో సమన్వయ సమావేశం

**జలుమూరు, జూన్ 27(వార్త):** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ జి. సుజాత, డాక్టర్ అహల్య సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు సంబంధించి శనివారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. జూన్ 28న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ప్రయాణంలో ఉన్న కుటుంబాల చిన్నారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, వ్యవసాయ కూలీల కుటుంబాలు, సంతలు, మురికివాడలు, రాళ్లు కొట్టే కార్మికుల పిల్లలకు మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు వివరించారు. జూన్ 28న బూత్‌లకు రాలేని చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 2,723 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 18 పోలియో బూత్‌లు, 39 బృందాలను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంఈఓ మాధవరావు, సీఎచ్‌వో పద్మావతి, పీహెచ్ఎన్ కె. పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ చినరాజులు, హెల్త్ అసిస్టెంట్లు చిన్నారావు, శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.




## ఆలయాల సమీపంలో వైన్ షాపుపై వైసీపీ ఫిర్యాదు



**నరసన్నపేట, జూన్ 27(వార్త):** నరసన్నపేట పట్టణంలోని పెద్దపేట ప్రాంతంలో ఆలయాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై స్థానికులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆంజనేయస్వామి, జగన్నాథస్వామి ఆలయాల ప్రాంగణాలకు సమీపంలో వైన్ షాపును ప్రారంభించడం సరికాదని వారు పేర్కొన్నారు. శనివారం మాజీ సర్పంచ్ కృష్ణప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ రాజారావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట అప్పలనాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. ఆలయాలకు భక్తులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు అధిక సంఖ్యలో వస్తుంటారని, అలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం నిర్వహించడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని వారు వివరించారు. ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలగకుండా సంబంధిత వైన్ షాపును మరో అనువైన ప్రాంతానికి తరలించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఎక్సైజ్ శాఖ అధికారులు విషయాన్ని పరిశీలించి నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



**నరసన్నపేట, జూన్ 27(వార్త):** ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ట్రైనీ ఎస్సై సత్యనారాయణ, శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ తెలిపారు. శనివారం నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రజల హక్కులు, భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించిందని, వాటిపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని సూచించారు. విద్యార్థి దశలోనే చట్టాల గురించి అవగాహన పెంపొందించుకుంటే మంచి పౌరులుగా ఎదగడంతో పాటు నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని ట్రైనీ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. చట్టాలను గౌరవించడం, వాటిని పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు చట్టాలు, సామాజిక బాధ్యతలు, వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై కూడా తరచూ అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా బాలల రక్షణ, సైబర్ భద్రత, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు చట్టాలపై పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులు



**నరసన్నపేట, జూన్ 27(వార్త):** ప్రభుత్వం చేపట్టిన 'బడి పిలుస్తుంది' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని, దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికతో పాటు హాజరు కూడా గణనీయంగా పెరిగిందని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) ఉప్పాడ శాంతారావు తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం కొత్తపేట ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. గతంతో పోలిస్తే విద్యార్థుల హాజరు మెరుగుపడటంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు దామోదర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన ఎంఈవో, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులతో సమన్వయం కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా విద్యాబోధన కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 160 మంది చేరిక

- 560 మంది విద్యార్థుల లక్ష్యంతో ముందుకు - ప్రిన్సిపాల్ పవన్



**నరసన్నపేట, జూన్ 27(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి జీవన్ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థి సాధించిన విజయాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రవేశాల వివరాలను వెల్లడించిన ఆయన, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్‌లో ఇప్పటికే 160 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. దీంతో మొదటి, రెండో సంవత్సరం కలిపి కళాశాలలో మొత్తం 420 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు చెప్పారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగిందని, మరింత మంది విద్యార్థులను ఆకర్షించేందుకు అధ్యాపక బృందం ప్రత్యేకంగా కృషి చేస్తోందని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 560 మంది విద్యార్థుల చేరిక లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546